



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు 'కేసీఆర్-ది మ్యాన్ ఆఫ్ మిలియన్స్' పుస్తకాన్ని అందజేస్తున్న డా.మంతెన దామోదరచారి

## ''కేసీఆర్.. మ్యాన్ ఆఫ్ ది మిలియన్స్''

రవీంద్రభారతి, మార్చి 29 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను శుక్రవారం అంతర్జాతీయ కవి, అంగ్ల అనువాదకుడు డా.మంతెన దామోదర చారి శుక్రవారం ఎర్రవల్లిలో కలిశారు. మంతెనతో కేసీఆర్ దాదాపు అరగంటసేపు మాట్లాడారు. రాజకీయ సంక్షోభంలో ఉన్నప్పటికీ కేసీఆర్ చెక్కుచెదరని వైఖరితోనే తమతో గడపడం తనకెంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. 'కేసీఆర్-ది మ్యాన్ ఆఫ్ మిలియన్స్' పుస్తకాన్ని కేసీఆర్‌కు అందజేశారు.



మేడ్చల్ మల్కాజిగిరి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులను అభినందిస్తున్న న్యాయవాదులు

## మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా.. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అమరేందర్‌రెడ్డి

చర్లపల్లి, మార్చి 29 : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా అమరేందర్‌రెడ్డి, శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మోహన్, సంయుక్త కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా మీనా, లైబ్రరి కార్యదర్శిగా సంతోష్‌కుమార్, స్పోర్ట్స్ కార్యదర్శిగా స్టాన్లీ, మహిళా ప్రతినిధిగా సుజాత, కమిటీ సభ్యులుగా అనిల్‌కుమార్, పావన్ రాఘవ, డెవిడ్, సరిత, రవికృష్ణ ఎన్నికయ్యారు.



## నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్యవర్ధన్‌రెడ్డి

నాంపల్లి కోర్టులు, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్యవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనిథ్, ఉపాధ్యక్షుడిగా గోకుల్, రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా మామిడాల రమేశ్, స్పోర్ట్స్ కార్యదర్శిగా పర్వేజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## క్యాన్సర్ రోగుల్లో నొప్పి నిర్వహణ ప్రధానమైంది : డాక్టర్ బండికట్ల



సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): క్యాన్సర్ రోగుల్లో నొప్పి నిర్వహణ అనేది చాలా ముఖ్యమైన అంశమని ప్రముఖ పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ విజయ్‌భాస్కర్ బండికట్ల అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని హోటల్ దసపల్లాలో ఇండో బ్రిటీష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డా.బండికట్ల పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్ రోగులు దురదృష్టవశాత్తు తీవ్రమైన నొప్పిని అనుభవిస్తున్నారని, ముఖ్యంగా వ్యాధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్న వారు ఈ నొప్పికి గురవుతున్నారన్నారు. ఇలాంటి రోగులకు నొప్పి నుంచి ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్నో రకాల నొప్పి నిర్వహణ పద్ధతులు అందుబాటులోకి వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.సెంథిల్, డా.గాయత్రితో పాటు పలువురు క్యాన్సర్ వైద్యనిపుణులు పాల్గొన్నారు.

## గత మే నెల రికార్డులు.. మార్చిలోనే బ్రేక్

- గ్రేటర్‌లో ఈనెల 28న రికార్డు స్థాయిలో.. 79.48 మిలియన్ల యూనిట్ల వినియోగం
- గత మార్చిలో 67.97 మిలియన్ యూనిట్లు మాత్రమే
- ఈ ఏడాది దాదాపు 22.7 శాతం పెరిగిన వినియోగం

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ఊహించని విధంగా విద్యుత్ వినియోగం నమోదవుతున్నది. ప్రతియేటా వేసవి విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్నప్పటికీ, రికార్డు స్థాయిలో నమోదవుతుండడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ వినియోగంలో మే నెలలో నమోదయ్యే రికార్డులు ఈసారి మార్చి నెలలోనే నమోదవుతున్నాయి. తాజాగా గురువారం (మార్చి 28న) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 79.48 మిలియన్ యూనిట్ల రికార్డు స్థాయి విద్యుత్ వినియోగం నమోదైందని అధికారులు తెలిపారు. గతేడాది(2023) మే 19న 79.33 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అత్యధిక రికార్డుగా నమోదైతే, ఈ ఏడాది మాత్రం మార్చి 28నే దాన్ని మించి నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది మార్చి నెలలో అత్యధిక విద్యుత్ వినియోగం 67.97 మిలియన్ యూనిట్లు



మాత్రమే. గతేడాది మార్చి నెల సరాసరి విద్యుత్ వినియోగం 70.96 మిలియన్ యూనిట్లు. దాదాపు 22.7 శాతం పెరుగుదల నమోదైంది. ఈ సీజన్‌లో విద్యుత్ వినియోగం 90 మిలియన్లకు చేరే అవకాశం ఉన్నదని, డిమాండ్ ఎంత పెరిగినా తట్టుకునేందుకు గాను అదనపు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర అసరమైన ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

### విద్యుత్ సరఫరాపై 24/7 పర్యవేక్షణ...

గ్రేటర్‌లో విద్యుత్ సరఫరా తీరుపై ప్రతి రోజు ఉదయం 8:30 గంటలకు అన్ని జోన్లు, సర్కిళ్ల పరిధిలోని సీజీఎంలు, ఎస్ఈలతో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు విద్యుత్ డిమాండ్, సరఫరాలో విద్యుత్ అంతరాయాలు, సిబ్బంది హాజరు వంటి నివేదికలు పరిశీలించడం చేస్తున్నారు. దీనికి తోడు సమస్యాత్మక ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటనలు చేస్తున్నారు.

### ఫ్యూజ్ ఆఫ్ కాల్ వ్యవస్థ బలోపేతం...

అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) కార్యాలయాల బలోపేతం కోసం సీబీడీ లైన్స్ వంటి ఇతర విభాగాలను ఏకీకరణ చేసి ఆపరేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లకు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ పరిధిలోని 212 సెక్షన్ స్థాయి ఎఫ్ఓసీల్లో దాదాపు 800 మంది సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. దీనికి తోడు పీక్ అవర్స్ ముగిసే వరకు ప్రతి రోజు 9 గంటల వరకు విధుల్లోనే అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండేలా సీఎండీ ఆదేశించారు. వారానికి ఒకసారి సీజీఎం, ఎస్ఈలు విధిగా బస్తీల్లో, కాలనీల్లో పర్యటించాలని ఆదేశించారు.

## మూడు నెలల్లోనే.. రేవంత్ రెడ్డి కండ్లు నెత్తికెక్కినై

- ఎంపీగా ఉన్న ఐదేండ్లు మల్కాజిగిరిని పట్టించుకోలేదు
- ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

నేరేడ్‌మెట్, మార్చి 29 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఊసరవెల్లి మాటలు మాట్లాడుతున్నాడని, ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీలు విఫలమయ్యాయని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం గౌతంనగర్ డివిజన్ లక్ష్మీసాయి గార్డెన్స్‌లో బీజేపీ బూత్ కమిటీ సభ్యుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ఐదుసార్లు కూడా నియోజకవర్గానికి రాలేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన



లక్ష్మీసాయి గార్డెన్స్‌లో జరిగిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి ఈటల రాజేందర్

మూడు నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి కండ్లు నెత్తికి ఎక్కాయని మండిపడ్డారు. ఓటర్లందరూ తెలివిగలవారని రాజకీయాల పట్ల పూర్తి అవగాహన ఉందన్నారు. మంచి మనస్సుతో బీజేపీని ఆశీర్వదించి ఓటు వేసి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మల్కాజగిరి కార్పొరేటర్ శ్రవన్, మౌలాలి కార్పొరేటర్ సునితా శేఖర్ యాదవ్, నాయకులు ఆర్కే శ్రీనివాస్, వెంకటేశ్, గోలి మధుసూదన్‌రెడ్డి, టీం సాయి, ప్రసన్న, వీకే మహేశ్, భానుప్రకాశ్, గిరివర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, వాసంశెట్టి శ్రీనివాస్, నరసింహగౌడ్, ఆనంద్, వడ్డె సుబ్బారావు, ప్రీతం రామకృష్ణ, మడిపడిగె జగదీశ్ గౌడ్, గణేశ్, లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌చారి



నాంపల్లి కోర్టులు, మార్చి 29 (నమస్తే తెలంగా) : హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వై.శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షుడుగా ఎం.ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా హర్షవర్ధన్‌రెడ్డి, లైబ్రేరియన్‌గా వి.సుధాంశు, కోశాధికారిగా టి.విశాల్‌సింగ్, క్రీడల కార్యదర్శిగా ఆర్.సైదిరెడ్డి, లేడీ రిప్రజెంటేటివ్‌గా ఎస్.జస్వంత్‌కౌర్, కార్యవర్గ సభ్యులుగా కె.అశోక్, కె.భానుచందర్, మహ్మద్ బర్కత్‌అలీ, ఎన్.రాజు, వాస మధుసూదన్, వి.వినోద్‌కుమార్, సవిత మిశ్రా ఎన్నికైనట్లు పోలింగ్ అధికారి గోపాల్‌సింగ్ తెలిపారు.

### పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజయ్య

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్యానల్ ఎన్నికలు శుక్రవారం రామంతాపూర్‌లో జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజయ్య, జనరల్ సెక్రటరీగా టి.ఉదయ్‌కుమార్, ట్రెజరర్‌గా కిరణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా కె.విష్ణు, ఉమెన్ సెక్రటరీగా సీహెచ్ స్వాతి రెడ్డి, జోన్-2 సెక్రటరీగా ఎ.జయకృష్ణ, జోన్ వన్ సెక్రటరీగా ఆర్.వెంకటేశ్వర్లు విజయం సాధించారు. ఎలక్షన్ కమిటీ సభ్యులు పి.సైదులు, రవి, జగత్‌ప్రభు, రాజశేఖర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి వ్యవహరించారు.

## ఇచ్చిన హామీని విస్మరించిన సీఎం


- బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపీ

ఖైరతాబాద్, మార్చి 29 : ఎన్నికల ముందు వంద రోజుల్లో తమ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ సామాజికవర్గాన్ని విస్మరించారని బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మీనగ గోపీ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డాక్టర్ చెల్లప్ప కమిషన్ సిఫారసును పరిగణలోకి తీసుకుంటామని, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం వంద రోజులు దాటిపోయిందని, కానీ తమకు ఇచ్చిన మాట ఊసెత్తడం లేదన్నారు. తమ వాదన వినిపిస్తామనుకుంటే ఇప్పటి వరకు బోయలు చట్టసభల్లో అడుగుపెట్టలేదన్నారు. సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపిస్తే కేంద్రం పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో రాజేశం, నర్సయ్య, అంజయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మినగ గోపీ, ప్రొఫెసర్ ప్రభంజన్, తదితరులు

## ఎండలు బాబోయ్..




సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): దక్షిణం దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటడంతో పాటు గాలిలో తేమ శాతం భారీగా తగ్గిపోవడంతో నగర ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో ఈ వేసవిలోనే రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.2డిగ్రీలుగా నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.4డిగ్రీలు, గాలిలో తేమ 25శాతానికి పడిపోయింది. దీంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

### ఎన్నికల కమిషన్ స్పెషల్ ఫోకస్

మేడ్చల్, మార్చి29(నమస్తే తెలంగాణ) : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ప్రజలకు ఎలాంటి ఒత్తిడిలు లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, నగదు తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 18004252050కు ఫోన్ చేయాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకునేందుకు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల్లో యువత వంద శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా స్వీప్ ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

### కొలెస్ట్రాల్ తగ్గించడంలో రైస్‌బ్రాన్ ఉత్తమ ఫలితాలు

Freedom Rice Bran Oil

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): గుండెకు ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు నరాల్లో కొలెస్ట్రాల్ చేరకుండా అరికట్టడంలో రైస్‌బ్రాన్ ఆయిల్ ఉత్తమ ఫలితాలు ఇస్తుందని జమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'కొలెస్ట్రాల్‌కి సఫాయీ కా స్పెషలిస్ట్' అనే నినాదంతో ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఫ్రీడమ్ రైస్‌బ్రాన్ ఆయిల్‌లో 10వేల మిలియన్‌లకు పైగా ఒరైజనాల్‌తో పాటు సహజ యాంటీ ఆక్సిడెంట్లైన టోకోఫెరోల్, టోకోట్రినాల్స్ వంటి పదార్థాలు ఉంటాయన్నారు. దీని వల్ల ప్రతిరోజు వంట కోసం ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌ని వినియోగించడం ఆరోగ్యానికి మంచిదన్నారు.

### టెట్ అర్హత ఫీజును తగ్గించాలి

- బొల్లెపల్లి స్వామిగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 29 : టెట్ అర్హత పరీక్షా ఫీజును తగ్గించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పెరుమల ఏడుకొండలు, సురేశ్‌గౌడ్, గాజుల నవీన్, బద్రి, జాల లాలు, రాజశేఖర్, మహేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



జీవిత బీమాపై అవగాహన కల్పించడంలో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ మీద ప్రయాణం చేసిన వికలాంగ సైకిలిస్టు తమీమ్ అన్సారీని ప్రశంసిస్తున్న శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు.
- సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ):

## జింఖానాలో హునార్ మహోత్సవ్

కంటోన్మెంట్, మార్చి 29 : ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హునార్ మహోత్సవ్ ఎక్స్‌పో గాంధీ స్మృతి దర్శన్ సమితి, న్యూఢిల్లీ సహకారంతో నగరంలోని జింఖానా మైదానంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. జింఖానా గ్రౌండ్‌లో 12 రోజుల పాటు జరిగే ప్రదర్శనను సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్ ప్రారంభించారు. 25 కంటే ఎక్కువ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 350 మంది కళాకారులు, చేతివృత్తుల వారిని కలిగి ఉన్న హునార్ మహోత్సవ్ ఎక్స్‌పో వివిధ రకాల వస్తువులను అందిస్తుందని తెలిపారు. గాంధీ స్మృతి దర్శన్ సమితి వైస్ చైర్మన్ విజయ్ గోయెల్ మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ కేవలం ప్రదర్శన మాత్రమే కాదని చెప్పారు. ఈ ప్రదర్శన సందర్శకులకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదని పేర్కొన్నారు.



ఎగ్జిబిషన్‌లో వస్తువులను పరిశీలిస్తున్న బోర్డు సీఈఓ మధుకర్ నాయక్

## మెట్రో రైలు ప్రాజెక్టు అద్భుతం

- ఫ్రెంచ్ రాయబారి థియెరీ మాథ్యూ

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ఫ్రెంచ్ రాయబారి బృందం ప్రత్యేకంగా పరిశీలించింది. భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ ఆయన బృందానికి ఎల్అండ్‌టీ మెట్రో రైల్ లిమిటెడ్ అధికారులు శుక్రవారం స్వాగతం పలికారు. ఉప్పల్‌లోని మెట్రో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. మెట్రో రైల్ నెట్ వర్క్‌కి సంబంధించిన రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల భద్రత, రియల్ టైమ్ సిస్టమ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాల నిర్వహణకు ఇది సెంట్రల్ హబ్‌గా వ్యవహరిస్తుందని మెట్రో అధికారులు వివరించారు. పట్టణ ప్రాంత రవాణా విభాగంలో సాంకేతిక పురోగతికి నిదర్శనమైన హైదరాబాద్ మెట్రో రైల్వే వ్యవస్థ ఎంతగానో ఆకట్టుకున్నదని ఫ్రెంచ్ రాయబారి థియెరీ మాథ్యూ తెలిపారు. భవిష్యత్తులోనూ కలిసి పనిచేసేందుకు, సుస్థిరమైన అర్బన్ మొబిలిటీ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు మాథ్యూ బృందం దోహదం చేస్తుందని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్అండ్‌టీ మెట్రో ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తున్నదని, పరస్పర సహకారంలో కలిసి పనిచేసేందుకు ఇలాంటి పర్యటనలు తోడ్పడతాయన్నారు. ఫ్రెంచ్‌కు చెందిన కంపెనీ కియోలిస్ మెట్రో రైళ్ల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు.



ఉప్పల్ మెట్రో రైలు ప్రాజెక్టులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఫ్రెంచ్ రాయబారి డాక్టర్ థియెలీ మాథ్యూ బృందం